క్లుప్తంగా

క్రికెట్ కిట్ అందజేత



వేలేరు : మండలంలోని సోడాషపల్లి క్రికెట్ టీమ్‌కు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.40 వేలు చేసే క్రికెట్‌కిట్‌ను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువజన నాయకుడు దినేశ్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన యువత వేసవి సెలవుల్లో దురలవాట్లకు బానిస కాకుండా ఆటలతో ఆహ్లాదం పొందాలనే ఉద్దేశంతో క్రికెట్‌కిట్ అందించినట్లు తెలిపారు. అనంతరం పల్లాకు క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. వినయ్, బుచ్చిరెడ్డి, చంటి, ప్రదీప్, వెంకటేశ్, రాహుల్, రాజు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలి



వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఫర్టిలైజర్ షాపుల యజమానులు రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని ఏఓ పద్మ సూచించారు. ఈ మేరకు సోమవారం వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువుల, పురుగు మందుల షాపుల యజమానులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు, ఎరువులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

22న నృసింహస్వామి జయంతి

దామెర : ఈనెల 22వ తేదీన మండలంలోని ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నృసింహస్వామి జయంతిని నిర్వహించనున్నట్లు ఆయల ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధచతుర్థశి బుధవారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించనున్నారు. 11 గంటలకు స్వామివారి కల్యామహోత్సవం, అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు.

నలుగురి బైండోవర్



వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా తయారీ చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి స్థానిక తహసీల్దార్ కోమి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ కాజీపేట సీఐ చంద్రమోహన్ ఆదివారం తెలిపారు. ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరిండెంట్ ఆదేశాల మేరకు కాజీపేట సీఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎస్సై మమత, కానిస్టేబుళ్లు కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో దాడులు నిర్వహించగా పీచరకు చెందిన కొయ్యడ రఘు, ఎల్లమ్మ, వావిల్లకుంటతండకు చెందిన బానోతు శ్రీనివాస్, జర్పుల రమాదేవిను అరెస్ట్ చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. మరికొంత మంది అనుమానితులను అరెస్టు చేసి బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్స్ ఖలీల్, కోటిలింగం, లాలయ్య, రషీద్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు క్రీడా పోటీలు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ జర్నలిస్టు సభ్యులకు క్రీడలు నిర్వహించాలని ప్రెస్ క్లబ్ కమిటీ నిర్ణయించింది. క్రీడల్లో పాల్గొనాలనే ఆసక్తి గల జర్నలిస్టులు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ప్రెస్ క్లబ్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యార్థులకు ఆర్యవైశ్య మిత్ర బృందం సన్మానం

వరంగల్ చౌరస్తా: పదవ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థులను సోమవారం సన్మానించారు. వరంగల్ మేదరవాడలోని ఆర్యవైశ్య మిత్ర బృందం కార్యాలయంలో కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 9.5 – 10 జీపీఏ సాధించిన పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు, ఇంటర్ సెకండియర్‌లో 95% మార్కులు సాధించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్రబందం కోశాధికారి దొడ్డ మోహన్‌రావు, నాయకులు పల్లా పరమేశ్వర్, పాల మురళీధర్, సదాశివుడు, చిన్నాల సురేష్ పాల్గొన్నారు.

అరకొరగా ప్రభుత్వ వైద్య సేవలు

- అద్దె భవనంలో ఉపకేంద్రం
- అందుబాటులోలేని అత్యవసర వైద్య సేవలు
- ప్రైవేటు వైద్యానికి స్థానికుల పరుగులు



ఆరోగ్య ఉపకేంద్రం (ఫైల్)



ఆరోగ్య ఉపకేంద్రం స్థలంలో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం

నడికూడ : మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నాలుగు దశాబ్దాల క్రితమే మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య ఉపకేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రైవేటు ఆస్పత్రులకు పోటీగా ప్రసవాలు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందాయి. కాలక్రమేనా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలోకి తరలించారు. అప్పటి నుంచి వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి.

బిల్డింగ్ కూల్చి గ్రామపంచాయతీగా మార్చి..

ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని కూల్చివేసి అద్దె భవనం నుంచి వైద్య సేవలు అందించారు. అయితే నూతన భవనం నిర్మించిన అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని అందులోకి తరలించారు. ఆస్పత్రికి మరోచోట స్థలం కేటాయించి భవనం నిర్మిస్తామని చెప్పిన పాలకులు, అధికారుల హామీ నేటికి నెరవేరలేదు.

కుంటుపడిన వైద్య సేవలు

పక్కా భవనం లేకపోవడంతో మండలంలో ప్రభుత్వ వైద్య సేవలు కుంటుపడినట్లు విమర్శలు వస్తున్నాయి. ఒక డాక్టర్, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ముగ్గురు ఆశ వర్కర్లు వైద్య సేవలు అందిస్తున్నా అత్యవసర సేవలకు మాత్రం ఆమడదూరంలో ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పాము కాటుకు, సీజనల్ వ్యాధులకు, ప్రసవాలకు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు, ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని నడికూడ గ్రామానికి చెందిన బుర్ర నరేష్‌గౌడ్ ఇటీవల ఆమరణ నిరాహార దీక్షతో పాటు ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అప్‌గ్రేడ్ చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ప్రస్తుతం అద్దె భవనంలో పల్లె దవాఖనగా కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రి భవన నిర్మాణానికి స్థలాన్ని సేకరించి నూతన భవనాన్ని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయాలి

ఒకప్పుడు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఆస్పత్రికి వచ్చేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందడం లేదు. నూతన భవనం నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతంలో వర్షాకాలం ఎక్కువగా సీజనల్ వ్యాధులు, పాము కాటుకు గురయ్యే అవకాశం ఉంది. పాలకులు, అధికారులు స్పందించి అత్యవసర వైద్య సేవలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకురావాలి.

– బుర్ర నరేష్ గౌడ్, నడికూడ

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ఎల్కతుర్తిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



భీమదేవరపల్లిలో..

ఎల్కతుర్తి : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, జగత్‌సింగ్‌లకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, పైడిపెల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతీ రైతుకు రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15వేలు, అలాగే కౌలు రైతులకు 15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు రోజువారి కూలీ 12 వందలు చెల్లించాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, పల్లెపాటి మధుకర్, ఆరేపల్లి వినోద్, మంతుర్తి శ్రీకాంత్, రమేశ్, శ్రీనివాస్, కరుణాకర్, గుండెల్లి సదానందం, వేముల ప్రసాద్, అయిత సాయి, వికాస్, ముద్దసాని వీరన్న, మాడుగుల అజిత్‌కుమార్, బోడ రమేశ్, బోనగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని మల్లారం గ్రామంలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మెళనం సోమవారం ఘనంగా జరిగింది. 2006–07 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని అప్యాయంగా పలకించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువును శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. విద్యార్థులంతా సంపక్తి భోజనం చేసిన అనంతరం ఫోటో గ్యాలరీ ఏర్పాటుచేసి గ్రూప్ ఫోటోలు దిగారు.

అవినీతి అధికారుల్లో వణుకు..



ఏసీబీ అధికారుల అదుపులో ధరణి ఆపరేటర్, తహసీల్దార్



కమలాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం

- ఇప్పటి వరకు చిక్కింది ఐదుగురు
- మరికొందరిపై నిఘా ముమ్మరం
- తర్వాతి వంతు ఎవరిదోనంటూ చర్చ

కమలాపూర్ : అవినీతి అధికారులు లంచం లంచం అంటూ రైతులను జలగల్లా పట్టి పీడిస్తున్నారు. కమలాపూర్ తహసీల్‌లో ధరణి ఆపరేటర్ రాకేశ్, తహసీల్దార్ పాలకుర్తి మాధవి లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. కాగా రెవెన్యూ అధికారుల అవినీతి బాగోతం జిల్లాలో సంచలనం సృష్టించగా తాజా ఘటనతో అవినీతి అధికారుల్లో వణుకు మొదలైంది. ఎక్కడా.. ఎలా ట్రాప్ అవ్వుతామోననే భయం పట్టుకుంది.

అవినీతికి కేరాఫ్‌గా కమలాపూర్ తహసీల్..

కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడ ఏ పని కావాలన్నా ఆమామ్యా ముట్ట జెప్పాల్సిందేనని, పనికో రేటు ఉంటుందని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అయితే అదే కార్యాలయంలో మరో ముగ్గురు అవినీతి జలగలున్నారని, ప్రస్తుతానికి ఒక్కరే ఏసీబీకి వలకు చిక్కారని, అయికతే మిగిలిన వారు కూడా ఏసీబీ వలకు చిక్కితే కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి చేపలు అంతరించి పోతాయని మండల వాసులు గుసగుసలాడుకుంటున్నారు.

ఏసీబీ వలలో ఐదుగురు..

అవినీతి అధికారుల వేధింపులు తాళలేక పలువురు బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తుండగా ఏసీబీ అధికారులు సైతం అవినీతి అధికారులపై ముమ్మరంగా నిఘా పెడుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు ఐదుగురు అవినీతి అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో అంబాల వీఆర్వో రాంచందర్‌రావు, గుండేడు వీఆర్వో రమేశ్‌బాబు, హౌసింగ్ ఏఈ ఖాజా హుస్సేన్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కి సస్పెండయ్యారు. అదేవిధంగా శనిగరం వీఆర్వో శ్యాంసుందర్‌ను అప్పటి జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. తాజాగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.5 వేలు లంచం తీసుకున్న ధరణి ఆపరేటర్ రాకేశ్, తహసీల్దార్ మాధవిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరిపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తర్వాత వంతు ఎవరిదో?

మండల వ్యాప్తంగా పలు శాఖల అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికి వీటిలో సింహాభాగం మాత్రం రెవెన్యూ శాఖదే. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం కోసం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు హెచ్చరిస్తుండడంతో అవినీతి అధికారుల గుండెల్లో ధడ పుడుతుంది. ఇప్పటికే ఏసీబీ వలలో ఐదుగురు చిక్కారని, తర్వాత వంతు ఎవరిదోనని మండలంలో సర్వత్రా చర్చించుకుంటున్నారు.

ఆంజనేయుడి విగ్రహానికి క్షీరాభిషేకం



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లోని దక్షిణముఖ అభయాంజనేయుడి విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాసశర్మ 108లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకొచ్చిన నదీ జలాలతో స్వామివారిని అభిషేకించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అనగం యాదగిరితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

హసన్‌పర్తి: భీమారంలో కబ్జాకు గురైన సర్కారు భూములను పరిరక్షించాలని కార్పొరేటర్ జక్కుల రజిత కోరారు. ఈమేరకు భీమారంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భీమారంలోని శ్యామల చెరువు, పుట్టలమ్మ చెరువు, కొచ్చెరువులతో పాటు ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురైనట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భూములకు హద్దులు నిర్ధారించాలని సూచించారు. కొంతమంది ఎస్సారెస్పీ భూములను ఆక్రమించి విక్రయాలు చేపట్టారని తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను సంరక్షించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: ప్రహరీ నిర్మాణానికి తవ్విన కందకాన్ని పూడ్చి భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులు సామాల నిరంజన్, నూనె రవి కోరారు. ఖిలావరంగల్ శివారు దూపకుంట రోడ్డులో పట్టాదారుడి వద్ద కొనుగోలు చేసిన భూమి తనదంటూ ప్రహరీ కోసం తవ్విన పునాదిని పూడ్చి కబ్జాకు యత్నించిన వ్యక్తిపై బాధితులు సోమవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తిరుకల్యాణానికి ఆలయం ముస్తాబు



బ్రహోత్సవాలకు ముస్తాబైన ఆలయం

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు వేసి ముస్తాబు చేశారు. నేడు అధ్యాయనోత్సవం, తొళ్లకం ప్రారంభం, పుట్ట బంగారుసేవా, ధ్వజారోహణం, గరుడముద్ద, 22న మత్స్యగిరిస్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం మహా అన్నదానం, 23న పూర్ణాహుతి, సాయంత్రం గజవాహనం సేవ (గుట్ట మీదకు పోవుట), 24న రథోత్సవం, అలుకతీరుట, సాంస్కృతిక కార్యక్రమాలు, 25న చక్రవర్తి, నాకబలి (నాగవల్లి), పండిత సన్మానంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలిన పిలుపునిచ్చారు.

వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం



ఐనవోలు : ప్రత్యేకాలంకరణలో ఉత్సవ మూర్తులు



ఆత్మకూరు : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో అష్టోత్తర శత కలశాభిషేకం యాజ్ఞికులు రవి ఆచార్యుడు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 18 నుంచి 23 వరకు షష్టమ(6వ) వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో నిత్యపూజలు పూర్తయిన తర్వాత బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు యాగశాలలో నిత్యహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అష్టోత్తరశత (108) కలశాలను సుగంధ, పరిమళ ద్రవ్యాలు, ఓషదులు, నవధాన్యాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, పంచ పల్లవాలు, నీటితో నింపారు. ప్రత్యేక పూజలు వేదమంత్రాలతో కలశస్థాపన చేసి నారాసింహుడి ధ్రువమూర్తికి, ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ, లక్ష్మణ, హనుమాన్ సహిత సీతారామచంద్రమూర్తి, గోధాకృష్ణ, పద్మావతి అలివేళిమంగ సహిత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. సాయంత్రం విష్ణుసహస్ర నామ పుష్పార్చన, సేవాకాలం తీర్థ ప్రసాదగోష్టి జరిపించారు. ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, తాడెం మోహన్, అర్చకుడు జయ కృష్ణమాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. అర్చకుడు ఆరుట్ల మాధవ మూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు గరుడ హోమం నిర్వహించి ధ్వజారోహణం చేశారు. సంతానప్రాప్తి, వివాహప్రాప్తి తదితర కోర్కెల ఫలితం కొరకు గరుడముద్దల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. అలాగే మంగళవారం రాత్రి 8గంటలకు ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరుగనుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించాలి



మాట్లాడుతున్న ప్రణవ్

పరకాల : ఈనెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ వొడితెల ప్రణవ్ కోరారు. సోమవారం పరకాల పట్టణంలోని మహదేవ్ కన్వెన్షన్‌హాల్‌లో పరకాల నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచార ఆర్భాటాలు లేకుండా నేరుగా పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని కోరాలని కార్యకర్తలను, నాయకులను కోరారు. పరకాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి రియాజ్, ఎంపీపీ బీమగాని సౌజన్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



పరకాల : మాట్లాడుతున్న కాళీప్రసాద్



దామెర : ప్రచారం నిర్వహిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి సతీమణి, కుమారుడు

పరకాల : ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు అన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలోను మోదీ హవా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, కార్యదర్శి రామన్న, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, ప్రధానకార్యదర్శి గాజుల నిరంజన్, ఉపాధ్యక్షుడు సంఘ పురుషోత్తంతో పాటు , నాయకులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ అయన సతీమణి లక్ష్మీదేవి, కుమారుడు త్రిశూల్‌రెడ్డి మండల కేంద్రంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. గతంలో రెండుసార్లు పోటీచేసి ఓటమి చెందిన ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. పట్టభద్రుల పక్షాన ప్రశ్నించే గొంతును గెలిపించాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, శక్తికేంద్రం ఇన్‌చార్జ్ ఎక్కలదేవి రమేశ్, బూత్ అధ్యక్షుడు కన్నె కొమురయ్య, మండల నాయకులు బిల్లా రమణారెడ్డి, అంబాల రాజయ్య, దామెరుప్పుల దేవేందర్, వేల్పుల బాలకృష్ణ, అలేటి సాయిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు తూముకు మరమ్మతులు



మడికొండ: మడికొండ పెద్ద చెరువు తూముకు మరమ్మతులను సోమవారం చేపట్టారు. తూము షెట్టర్ తుప్పు పట్టిపోవడంతో ఇరిగేషన్ అధికారులు పరిశీలించి నిధులు మంజూరు చేశారు. ఈమేరకు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణలను పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ పనులను దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో గండి పడిన మడికొండ కొత్తకుంట పనులను కూడా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీటి తొట్ల ఏర్పాటు



ఏర్పాటు చేసిన నీటి తొట్టె

ఆత్మకూరు : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రజని సహకారంతో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్లను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి యాదగిరి సోమవారం తెలిపారు. పశువైద్యశాల, బ్రాహ్మణపల్లి రోడ్డులో తొట్లను ఏర్పాటు చేసి నీరు పట్టినట్లు పేర్కొన్నారు. మూగజీవాలైన కోతులు, కుక్కలు, కోళ్ల కొరకు తొట్టీలు ఏర్పాటు చేశామన్నారు.

నూతన భవనంలోకి తహసీల్ కార్యాలయం



నడికూడ : మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారి పక్కన నిర్మించిన భవనంలోకి తరలించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. సోమవారం రికార్డులను, బీరువాలను, ఫర్నీచర్‌ను తరలించినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి నూతన భవనం నుంచే సేవలు అందిస్తామని తెలిపారు.